# [illegible]

మేఘశ్యాం

ఉదయం ఎనిమిది గంటలైంది. కిటికీలోంచి శీతాకాలపు చలిగాలి రయ్యిన వీస్తోంది. గుండెల దాకా రగ్గు కప్పుకొన్న రామ కృష్ణయ్యను ఆ చలి గాలి అంతగా బాధించటం లేదు. రబ్బరు పరుపు మీద— మేడ మీది గదిలో గడిపే ఆయన జీవితంలో ళ్ళో కెవరికీ కనిపించటం లేదు.

ఆయనకేం మహారాజా. ఈ వయసులో పక్షవాతంతో మంచం పడితే మటుకేం? ఆయన కేం తక్కువ? పెద్ద ఉద్యోగం చేసే కొడుకు, వెనకాల పల్లెలో చక్కని స్థిరాస్తి, కన్న కూతురిలా చూసుకునే కోడలు, పండ్లలాంటి మనుమలూ, చాలదూ!"

ఇవి లోకుల మాటలు.

లోకుల మాటలేమిటి ? ఆయన ఎదురుగానే అన్నారు. రామకృష్ణయ్య నవ్వి వూరుకున్నాడు. ఆ నవ్వు వెనకాల ఉన్న బాధ ఎవ్వరర్థం చేసుకోగలరు ? కొడుకు తన మాటకు నేటికీ ఎదురు చెప్పడు. కోడలు కన్న కూతురిలా చూసుకుంటుంది నిజమే ! ఎటొచ్చీ తనను అప్పుడప్పుడు ఆటలు పట్టించే వారొకరున్నారా ఇంట్లో. అది మధుసూదనుని ఆరు సంవత్సరాల కూతురు— బిందు. మెల్లగా దగ్గర చేరి తీయని కథలు చెప్పించుకొని కమ్మగా విని వెళ్ళేటప్పుడు అల్లరిపెట్టి పోతుంది. రామకృష్ణయ్యకు కోపం వస్తుంది.

రామకృష్ణయ్య పక్షవాతంతో మంచమెక్కి ఆరు నెలలయింది. ఆయన వయస్సిప్పుడు అరవై సంవత్సరాలు. ఆరు నెలల క్రితం ఆయన చాలా సరదాగా కబుర్లు చెబుతూ తిరిగేవాడు. హఠాత్తుగా ఈ రోగం వచ్చిపడి ఆయన్ను మంచాన పడేసి మానసికంగా కూడా చాలా కృంగదీసింది.

ఈ వార్ధక్యాన్ని చూసుకొని ఆయన తనలో తానే కుమిలి పోతున్నాడు. మంచాని కంటుక పోయి ఇలా రోజులు, నెలలు, సంవత్సరాలూ గడిపేకన్నా ఒక్కసారి చస్తే బాగుండుననిపిస్తోంది.

రోజులాగే ఈ రోజూ తెల్లవారింది. సూర్యుడు దయించాడు. అస్తమిస్తాడు. ప్రొద్దుగూకుతుంది. చీకటి పడుతుంది. ఒకప్పుడు తను కావాలని ఆ మేడ మీది గది అలా కట్టించుకున్నాడు. గదికి తూర్పున, పడమర రెండు పెద్ద కిటికీలు— ఉదయాస్తమయాలు తన గదిలోకి కనిపించాలని ఎంత ఆసక్తిగా కట్టించుకున్నాడు ! రోజూ ఉదయం, సాయంత్రం ఉదయాస్తమయాల్ని ఎంత ఆనందంగా చూసేవాడు ! ! అంతేకాదు— ఆ మేడ మీద నుంచి బయటి ప్రకృతి కనుచూపు మేర దాకా కనిపిస్తుంది. దూరాన ఏటి వంతెన మీదుగా వచ్చే కార్లూ, రైలు స్టేషను, మిగిలిన పట్టణం ఖిల్లా—అంతా కనిపించేది. మరోవైపున దూరాన ఉన్న పల్లెలు, అడవి, గుట్టలూ కనిపించేవి. తన బైనాక్యులర్సులో దూరంగా ఉన్న ప్రకృతిని కన్నుల ముందుకు లాక్కొని పరవశుడై పోయేవాడు. అప్పుడప్పుడు పార్వతికి కూడా చూపేవాడు. ఆమె పరవశురాలయ్యేది. ఒకసారి ఆమె పెద్ద కలహం లేపింది— ఇద్దరి మధ్యా ఆ రోజు తను రోజులాగే బైనాక్యులర్స్‌తో ప్రకృతిని చూస్తున్నాడు. ఏటికి ఒక మలుపు దగ్గర పొదలు అన్నీ దట్టంగా పెరిగి ఉన్నాయి. ఆ పొదల మధ్యన తనకో సుందర దృశ్యం కనిపించింది.

ఒక అందమైన లంబాడీ పడుచు దిగంబరియై స్నానం చేస్తోంది. ఏ ఊతపళ్ళో అమ్మటానికి పట్నం వచ్చి ఉంటుంది. తిరిగి పోతూ, ఏటిని చూడగానే పట్నం లారీలు, అవీ తన మీద కప్పిన దుమ్మును కడుక్కుందామనిపించింది కాబోలు ! ఎవరూ లేరు కదా అని పూర్తిగా వివస్త్రయై ఏటిలో జలకాలాడుతుంది. తను తన్మయుడై ఆమె పారవశ్యాన్ని, వంటరితనంలో ఆమెలోని విశృంఖలతను చూస్తున్నాడు. ఆమె శరీర నిర్మాణం ఎంతో చక్కగా ఉంది. చిన్న నాటి నుండీ కాయకష్టం చేస్తూ పొందికగా పెరిగిన శరీరం. తను ఇంత దూరం నుండి ఆమెను చూస్తున్నట్లు తెలియదు. బహుశా దూరంగా ఉన్నది దగ్గరగా చూపించే యంత్రసాధనం ఒకటుందని ఆమెకు తెల్సి ఉండదు. చాలా సేపట్నించీ తానామెను చూస్తున్నాడు. ఇంతలో— ఎప్పుడు వచ్చిందో ఏమో !

"ఏమిటి అంత దీక్షగా చూస్తున్నారు?" అంది పార్వతి.

తను ఉలిక్కి పడ్డాడు. ఇదివరకెప్పుడైనా ఆమె అలా ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా చేతిలోని బైనాక్యులర్‌ను ఆమెకిచ్చేవాడు. ఆమె చిరునవ్వుతో అందుకుని చూసేది! కాని, ఈ సారి ఆమె కలా ఇవ్వలేక పోయాడు. ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు.

బహుశా ఆ కారణంవల్లనే ఆమెలోని సహజత్వం ఒక కోరికగా మారిందేమో ! చొరవగా తన చేతిలోని యంత్రాన్ని తీసుకుని కనుచూపు మేర దూరంలో భర్తను తన్మయుణ్ణి చేసిన దృశ్యం కనిపిస్తుందేమోనని వెదికింది. చాలాసేపు చూసి, చివరికి అసలు విషయం కనుక్కున్నది. ఆమె ముఖం ముడుచుకు పోయింది. యంత్రాన్ని అక్కడ పడేసి— విసురుగా రెండతస్థులూ దిగి క్రిందికి వెళ్లిపోయింది.

తను ఖిన్నుడయ్యాడు. ముందే మామూలుగా యంత్రాన్ని ఆమె కందిస్తే— చూసేదే లేక అక్కడ పెట్టేదో— లేక చూసినా అంతగా పట్టించుకొనేది కాదో !! అలా కకుంటే తను అదివరకు చూడనట్టు నటించి అప్పుడే చూసినట్టు— ఆమె ఎదురుగానే చూసేవాడు.



కాని ఇప్పుడు విషయం మించింది. నగ్నంగా ఉన్న స్త్రీని ఇతర్తి అలా చూడ్డంతో ఆమెకు లజ్జ, రోషం, అభిమానం— అన్నీ పెనవేసుకున్నాయి.

ఆ రాత్రి తను ఆమెను ప్రసన్నురాలిని చేసుకోటానికి ఎన్నో యిబ్బందులు పడాల్సివచ్చింది. చివరికి ప్రసన్నురాలై ఆమె తనను పూర్తిగా క్షమించి ఆ విషయం మర్చిపోయింది. పార్వతి దేవత.

ఈ నాడా పార్వతి లేదు. అద్దం పగిలిన ఆ యంత్రం ఇంట్లో ఏ మూలో పడివుంది. ఒహూశా— వెతికితే, బాగుచేస్తే చక్రాల కుర్చీలో బయటకు వెళ్ళి చూసినా—తన నేత్రాలు ఏ యంత్రంలో నుంచీ అంత దూరదృశ్యాన్ని చూపించలేవు. పగలే మసగ్గా కనిపించే మనుష్యులు, అలికినట్లు కనిపించే ప్రకృతి.

ఆ రోజులు మళ్ళీ జీవితంలో రావు. పార్వతి వెళ్ళిపోయింది — తన జీవితంలో వెన్నెల పోయింది. మనసు బరువెక్కటంవల్ల కళ్ళల్లోకి నీరు వచ్చిందేమోనని కన్నులు తుడుచుకున్నాడు — పాడికళ్ళు చేతికి తగిలాయి. గోడుకున్న ఫోటోలో పార్వతి ముఖంవంక చూసాడు. సానుభూతిగా, జాలిగా తనవైపు చూస్తున్నట్లనిపించింది. ఆ బొమ్మకే ప్రాణంవస్తే యిప్పు డమాంతంవచ్చి తన హృదయంపై వాలిపోయి వేడి కన్నీరు కురిపించేది.

"పార్వతీ నీవు పోయావు— నేను మిగిలాను. ఎప్పుడు "కల్సుకుంటామో!" అనుకున్నాడు రామకృష్ణయ్య.

పార్వతి తనకు జీవితంలో మాధుర్యం చూపి— ఇంటిని స్వర్గంచేసిన దేవత. శాపం తీరగానే విముక్తురాలైనట్లు ఆమె తనను హఠాత్తుగా వదిలి వెళ్ళిపోయింది.

"ఏ మధుర క్షణంలోనో తను, అనేవాడు—

"పారూ! నేను చనిపోతే ఏం చేస్తావ్?"

ఆమె తన నెత్తిన ఒక్క మొట్టికాయ వేసి, "దెబ్బ తగిలిందా?" అంది.

తనకు నవ్వు వచ్చింది. "కొట్టి దెబ్బ తగిలిందా అని అడుగుతావేం? చిన్నప్పుడు మా అమ్మకూడా ఇంత గట్టి మొట్టికాయ వేయలేదు" అన్నాడు ఆమెవంక ఉడుకుమోత్తనంగా చూస్తూ.

"లేకపోతే ఏమిటా మాటలు?" అంది.

"ఏం జరక్కూడదా! లోకంలో ఎన్ని చూడటంటంలేదూ?"

"జరగొచ్చు, కాని, మన విషయంలో అలా జరగదు."


"ఎలా జరుగుతుందేమిటి?"

పార్వతి కనిపించని దైవాన్ని కోరిక కోరుతున్నట్టుగా శూన్యంలోకి చూస్తూ "మీకన్నా ముందు నేనే రాలిపోతాను" అంది నెమ్మదిగా.

"పార్వతీ" ఆ నాడు బాధగా పార్వతి తనను వదిలి వెళ్ళిపోతుందా? తను అది భరించగలడా?? తలుచుకున్నంత మాత్రంలోనే హృదయం బాధతో మెలికలు తిరిగిపోయింది. ఆమెను ఆవేగంగా దగ్గరకు లాక్కుని గట్టిగా కౌగలించుకొని

"వద్దు పార్వతీ! నన్ను వదిలిపోకు— ఎనెప్పుడూ వదలకుమువ్వ లేకపోతే నన్నెవరు చూస్తారు. నేనెవరికావాలి?" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. అతని కౌగిలిలో లతలా ఇమిడిపోయి మౌనంగా కన్నీరు తుడుచుకుంది. కాని, అలా జరగదని హామీ ఇవ్వలేదు.

ఏ తథాస్తు దేవతలు ఆ క్షణాన తథాస్తు అన్నారో అక్షరాలా పార్వతి ఆనాడు అసుర సంధ్యవేళ అన్నట్లుగానే జరిగింది.



తన జీవితంలో హాపిక తగ్గక ముందే, వార్ధక్య వ్యాధులు తనను చుట్టుముట్టక ముందే పార్వతి ఏ జబ్బూ లేకుండా హఠాత్తుగా గుండె ఆగి మరణించింది.

ఈసారి రామకృష్ణయ్య కళ్ళల్లోకి ఏమూలో దాగివున్న కన్నీరు కొద్దిగా పొంగింది. ఆ కన్నీటి తెరల్లోనుంచి పార్వతి తన ననునయిస్తూ చిన్న చిరునవ్వు నవ్వినట్లనిపించింది. ఆయన కన్నీరు తుడుచుకొని చూసాడు. ఫోటో నవ్వుతుందా? భ్రాంతి......కాని, ఆయనకాస్తి హాయనిపించింది.

అదే సమయంలో బిందు ఆ గదిలోకి వచ్చింది. బిందు తన బొమ్మలు, ఆట సామానంతా ఆ గదిలోనే ఒక బీరువాలో దాచుకొంటుంది.

ఆడుకోవటంమాత్రం క్రింది హాలులో. ఆ ఆట వస్తువులలో ఏ ఒక్కటి మరచిపోయినా— మోపిగ్గా రెండంతస్తులూ ఎక్కివచ్చి తీసుకుపోతుంది. ప్రతిసారీ పైకి వచ్చినప్పుడు— "తాతయ్యా, నా బొమ్మ జాగ్రత్త! ఎవరినన్నా తియ్యనిచ్చేవ్ !!" అని హెచ్చరించి వెళ్తుంది. ఆమె కదలలేని బొమ్మలకు— మంచంలోన్చి లేవలేని తాతయ్య కాపలా! అరగంటనుంచి క్రింద మధుసూధనుడు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతని గొంతు రామక్రిష్ణయ్య

కుటుంబములోని ప్రతివారు

జమున
స్నానపు సోపు
కోరుతారు
ఆదర్శమైన స్నానపుసోపు
తక్కువ ధర
ఎక్కువకాలం వాడవచ్చు
బెంగాల్
కెమికల్
* కలకత్తా
* బొంబాయి
* కాన్పూరు
మూడు వివిధ రంగుల
12 బిళ్ళలుగల
పెట్టెలలో లభించును

TEL
ఇప్పుడు
లభించుచున్నది
మీ ప్రియమైన
లోమ
వాటమైన ప్యాకింగ్‌లో కూడ

సామాన్య పెద్ద మరియు చిన్న సైజులలో కూడా
లభించుచున్నది
సీసాలో లేక ట్యూబ్‌లో గల లోమ
సర్వదా మంచిది

అంతర్దేశీయంగా
ప్రశంసనీయమైన
శ్రేష్ఠతగల హేర్ ఆయిల
మరియు శిరోజాలను
నలుపు చేయునది. ఆనంద
కరమైన సువాసన గలది.
హోల్ ఏజంట్లు మరియు ఎగుమతిదార్లు
ఎమ్. ఎమ్. ఖంభట్‌వాలా. అహమదాబాద్.1
ఏజంట్లు: పి. నరోత్తమ్ అండ్ కం., బొంబాయి.2.
మా స్టాకిస్టులు:
మెసర్స్ జె. బలవాయ్ అండ్ కంపెనీ; 260, చైనాబజార్, మదరాసు.

# చిరంజీవులు

ఆనవాలు పట్టలేకపోతున్నాడు. బిందును పిలిచి ఆ వచ్చిందెవరో తెల్సుకోవాలనిపించింది. కాని, ఈ అల్లరిపిల్ల కథలైతే గంటల తరబడి తనదగ్గర కూర్చుని వింటుంది. కాని— ఉత్తప్పుడు ముద్దొచ్చి పిల్చినా దగ్గరకు రాదు. అయినా రామకృష్ణయ్య ఆశ అంతరించలేదు.

"బిందూ! ఇలారా—!" అని పిల్చాడు.

తన బీర్వాలోంచి బొమ్మను తీసుకుని వెళ్ళిపోతున్న బిందు ఆగి, "ఎందుకు?" అంది.

"దగ్గరికి రా— చెబుతాను."

కాని బిందు రాలేదు.

"నీలాగా నాకు చెముడు లేదులే, ఇక్కడున్నా వినపడుతుంది. చెప్పు" అంది.

తాతయ్యకోపం వచ్చింది. "సరే వెళ్ళు. కాని, ఒక్క విషయం. ఇక నీ బొమ్మలుమాత్రం నేను చూడను. తెల్సిందా?"

బిందు ఇరకాటన పడింది. తన బొమ్మలకు తాతయ్య కాపలా లేకపోతే కష్టం. కొట్టుకుని కాళ్ళూ చేతులూ విరగ్గొట్టుకోవొచ్చు. లేక ఆ మధ్య వచ్చిన పిల్లల్నెత్తుకపోయే వాళ్ళు— ఎత్తుకుపోయినా పోవచ్చు. క్రింద ఎన్నో పనులలో సతమతమయ్యే తను అదంతా చూడాలంటే కుదిరేది కాదు. అందుకే తాతతో రాజీపడడం మంచిదని ఆ చిన్ని మనసుకు తోచింది.

మెమ్మదిగా తాతయ్య దగ్గరకు వచ్చి "చెప్పు తాతయ్యా? ఎందుకు పిల్చావు" అంది.

అలా దారికిరా అనుకున్నారు తాతయ్య.

"క్రింద మీ నాన్నతో మాట్లాడే దెవరు ?"

"వోస్! అదా ! పరంధామయ్యగారు"

"ఓ. పరంధామయ్యగారా ! ఇందాకట్నుంచీ గొంతు ఆనవాలు దొరక్క చస్తున్నాను. బిందూ నాకు చెముడన్నావు కదూ ! క్రింద మీ నాన్న, పరంధామయ్య మాట్లాడే మాటలు వినిపిస్తున్నాయి తెలుసా !" అన్నాడు.

"ఎందుకు వినిపించదూ ! వాళ్ళిద్దరూ తగూ పెట్టుకొంటుంటే వీధంతా వినిపిస్తుంది."

"ఇప్పుడు తగూ పెట్టుకుంటున్నారా" అన్నాడు విస్మయంగా.

"తగూ కాదులే, అంత పెద్దగా అరిచి మాట్లాడుకుంటున్నారు"

"అంతేకద !" అని తృప్తిగా వూపిరి పీల్చాడు

"మరి, నేను వెళ్తున్నాను తాతయ్యా ! బీర్వా, బొమ్మలు, జాగ్రత్త. ఎవర్నీ తియ్యనియ్యకు"— బిందు వెళ్ళిపోయింది.

రామకృష్ణయ్య ఆమె వెళ్ళిన వంక చూస్తూ, అలా దారిలోకిరా అనుకున్నాడు. లేకపోతే, తన దగ్గరా ఈ వెర్రి మొర్రి వేషాలు ! ఇప్పుడు బిందును చూస్తే చిన్ననాటి 'వసు' జ్ఞాపక మొచ్చింది. ఇద్దరూ ఆడుకునే వారు. కొట్టుకునే వారు తగువు లాడుకునేవారు. మళ్లీ కలిసి పోయేవారు. చాలా సాహసంగా ఉండేవారు. అమ్మో ! వసు కాస్త అల్లరి పిల్లా ? తను కాబట్టి నెట్టుక వచ్చాడు ! మరొకరైతే ఆమెతో స్నేహాన్నేనాడో తెంపేసు కునేవారు.

రామకృష్ణయ్య ఒక్కసారిగా పదకొండు సంవత్స

రాల బాలుడై పోయాడు. చిన్ననాటి విషయాల్లో లేచిపోసాగాడు. అవును. వసు అప్పుడు ఎనిమిది సంవత్సరాల పిల్ల. తమ ఇంటి ఎదురిల్లు. తనకప్పటికి బాగా వూహ వచ్చింది.

విద్యాభ్యాసం కోసం పట్నం వచ్చిన్నాకా పట్నవాసం చేసిన నాన్నగారు ఒక్కసారి పల్లెల్లో ఇమడలేక పోయారు. అందుకే పల్లెల్లో కాలుమీద కాలువేసుకొని, హాయిగా కాలం గడప గలిగినా, స్థిరాస్థి ఉన్నా— అది కవుళ్ళకిచ్చి పట్నం వచ్చి ఉద్యోగం చేయసాగారు. తాము దాదాపుగా పట్నవాసులై పోయారు. ఏడాది కొకసారి నాన్నగారితో తనూ, అమ్మా, మిగిలిన వారూ పల్లెవెళ్లి వచ్చేవారు. అక్కడంతా తనను "చినబాబు, చినబాబు" అని వాత్సల్యంతో చూసేవారు. తనకు పల్లెకు పోయినప్పుడు ఏమీ తోచేది కాదు. ఎప్పుడు. ఎప్పుడు పట్నం చేరుతానా అని తహతహలాడి పోయేవాడు. పైకి చెప్పక పోయినా, నాన్నగారూ అంతే! అమ్మమాత్రం పట్నం ఇష్టమో, పల్లె ఇష్టమో తెలీకుండా కనిపించేది. ఒకసారి తను అడిగాడు.

"అమ్మా, నీకు పట్నం ఇష్టమా, పల్లె ఇష్టమా ?" అని.

అమ్మనవ్వి, "నీకూ !" అంది.

"నాకు పట్నమే ఇష్టం."

"ఎందుకని ? మనకు స్వంత భూములు, ఇల్లూ, అన్నీ ఇక్కడున్నాయిగా, పట్నంలో మనకేముంది?" అంది అమ్మ.

పట్నంలో తనకేముందో అమ్మకు చెప్పటానికి సిగ్గనిపించింది. మవునంగా ఉండిపోయాడు.

"ఏముందిరా పట్నంలో ? అద్దె ఇల్లూ, సినిమాలూనా ?"

"మరి నాన్నగారు ఎందుకు పట్నంలో ఉండి పోయారు ?" ఎదురు ప్రశ్న లేసాడు.

అమ్మ ఎందుకో ఒక్క నిట్టూర్పు విడిచింది తను అమ్మ ముఖంకేసి అయోమయంగా చూసాడు.

"ఆయనక్కడ ఉద్యోగం ఉంది" అంది నిడిగా.

"నేనూ చదువుకొని ఉద్యోగం చేస్తాను" అన్నాడు.

అమ్మ నవ్వి వూరుకుంది.

"మరి, చెప్పవేమే ! నీకు పల్లె ఇష్టమా ?— పట్నమా ?" అని మళ్లీ అడిగాడు తను.

"ఎక్కడున్నప్పు డదియిష్టం"

"కాదులే— పట్నమే' అన్నాడు తను.

"ఎందుకనో చెప్పు" —

"అక్కడ విశాలాక్షమ్మగారూ, సుభద్రమ్మగారూ అందరూ ఉన్నారు. దంచకుండా బియ్యం వస్తాయి. తియ్యకుండా పాలువస్తాయి. పాదులు పెట్టకుండా కూరలు వస్తాయ్."

"బాబూ !" అని అమ్మ తనను దగ్గరకు లాక్కుంది.

ఎందుకో అమ్మ బాధ పడుతుంది. అదేదో తనకు తెలీదు. నాన్నగారొక్కొక్కప్పుడు అమ్మను చూస్తే చిరున లాడుతారు. అమ్మ దిగులుగా కళ్ల నీళ్ళు పెట్టుకుంటుంది. ఎందుకో ఏమిటో అర్థం కాదు.

కాని తనకు పట్నం అంటే ఇష్టం ఎందుకని ?

"వసు" కోసం. వసు తమ ఎదురింటి వారమ్మాయి. అది వరకు వాళ్ల మంచి వాళ్లు కారు. వాళ్లు ఇల్లు ఖాళీ చేయగానే— వసువాళ్ల అమ్మ, నాన్న వచ్చారు. ఎర్రగా, ఎర్రటేలులా ఉండే వసుతో తనకు చూడగానే స్నేహం చేసుకోవాలనిపించింది. ఆ అమ్మాయి తను చదివే బడిలోనే— తన క్లాసులోనే చేరింది. అది తనకు చాలా సంతోషం కలిగించింది.

బడి వదలగానే— ఆ ఇంటికి వస్తూంటే ఆమెను సమీపించి, "నీ పేరు" అని అడిగాడు.

"వసుమతీదేవి" అంది.

"అబ్బో, చాలా పెద్ద పేరే !"

"నీ పేరు ?"

"రాము"

"చాల చిన్న పేరు"

"అవును. మీ ఇంటి కెదురుగానే మా ఇల్లు" అన్నాడు.

"అయితే. . . . ?" అంది.

"మనం స్నేహంగా ఉండొచ్చు. కల్సి బడికి రావచ్చు— పోవచ్చు— ఏమంటావు?"

"వీల్లేదంటాను"

"యేం?"

"నీతో నాకు స్నేహమేమిటి? నీవు మగ పిల్లవాడివి —మీ మగపిల్లలంతా కల్సి ఆడపిల్లల్ని ఆటలు పట్టిస్తారు." అంది.

"నేనలా పట్టించను"

"సరే అయితే—"

"నిన్ను 'వసూ' అని పిలుస్తాను— ఏమంటావు?

"వీల్లేదంటాను, నా పేరు వసుమతీదేవి, అలానే పిలువు"

"కాదు. . 'వసు' అంటే చూడు— చిన్నగా అందంగా ఉంది"

"లేదు. ఇంట్లో వాళ్ళు అలా పిలిస్తేనే నా కోపం వస్తుంది."

"సరే, అలాగే పూర్తి పేరుతో పిలుస్తాలే— కాని, ఒదంతా అలవాటైన దాకా వసు అని పిలిస్తే కోపం రాదుగా !"

"రాదు— కాని నీవు నా పూర్తి పేరుతోనే పిలవటానికి ప్రయత్నించు."

"అలాగే"

అలా ప్రారంభమైంది ఆ స్నేహం. కాని తను మాత్రం పూర్తి పేరుతో ఆమెను పిలవలేదు. వసూ అనే అనేవాడు. ఇద్దరూ సన్నిహితులయ్యాక వట్టింపే లేక పోయింది. కాని "వసు" ప్రతి చిన్న విషయానికీ తన మాటే నెగ్గాలని ప్రయత్నించేది. అది తనకు నచ్చేది కాదు. దాంతో తగువు పడేది. ఒక పూట మాట్లాడుకునే వారు కారు. ఒకసారి తనకు జ్వరం వచ్చింది. 'వసు'— పాపం రోజూ వచ్చి చూసి పోయేది. "పాడు బడి ! పాపం, నీ దగ్గరుండకుండా ఇదొహటి—" అని విసుక్కునేది.


తనూ బాధ పడేవాడు. అయితే తన బాధ వేరు— తను స్కూలుకు వెళ్లేలోపుగా 'వసూ'తో మరెవడైనా జట్టు కలుపుతాడేమోనని ! కాని, అలా జరగలేదు. వసూ తనొక్కడితోనే జట్టు కలిపింది. మిగిలిన ఆడపిల్లలంతా వసూ నుడికించేవారు— రాము—నీమొగుడని ! అయినా వసు లెక్క చేయలేదు.

ఇంట్లోవారు వారిస్నేహం చూసి ముచ్చట పడేవారు. పెద్దవారు కూడా వాడిని చూసి వరుసలు కలుపుకున్నారు. అంతా— ఆత్మ బంధువుల్లా— ఏ పండుగ పబ్బం వచ్చినా ఎక్కడో ఒకే చోట భోజనాలు చేసేవారు.

ఇలా రెండు మూడు సంవత్సరాలు గడిచి పోయాయి! వసూ—తన స్నేహం వృద్ధి చెందింది. ఈ గడిచిన కాలంలో తాము ఎన్నోసార్లు పోట్లాడుకున్నారు— వెక్కిరించుకున్నారు— విడిపోయాదు కల్సుకున్నారు.

వసూకు— వీధి చివరనున్న పున్నాగ చెట్టు పువ్వులంటే ఇష్టం. అయితే అవి ప్రొదెక్కి లేచేది.

32 వ పేజీ చూడండి



ఈ సినిమాలో రాములవారి వనవాసం సీను చాలా ఉత్సుకంగా వుంది సుమీ !

44 సం॥ల ఖ్యాతి నొందినది
కృష్ణవేణి ఇంకు




సోల్ ఏజంట్లు:
నేషనల్ ప్రోడక్ట్సు సిండికేట్,
మద్రాసు—21.

తామరకు
లిచెన్‌సా

సుప్రసిద్ధమైన
జర్మన్ నివారిణి
ప్రతిచోటా డాక్టర్లు
సిఫారసు చేస్తారు
ఈ క్రిందివాటికి నిరపాయకరము.
అమోఘము అగు శీఘ్రనివారిణి

- పుళ్లు
- కాలివ్రేళ్ల మధ్యపాసిన పుళ్లు
- మడమపగుళ్లు
- చాకలి గజ్జి
- మొటిమలు-ఇంక ఇతర చర్మరోగములు

అసలు జర్మన్ సూత్రాన్ని అనుసరించి
ఇండియాలో వీరిచే తయారు చేయబడును
ది డాలర్ కంపెనీ
337, తంబుచెట్టి స్ట్రీటు, మద్రాసు.
పెద్ద కెమిస్టులు అందరివద్ద లభించగలదు
DOL-1 TG

# చిరంజీవులు

15 వ పేజీ తరువాయి

ఆమె వెళ్లేసరికి పువ్వులన్నీ అంతా ఏరుకు పోయేవారు. అప్పుడు తను చెట్టెక్కి కొమ్మలు కదిలించి తాజాపువ్వులు రాల్చి ఆమెను సంతోష పెట్టేవాడు. తమ ఇద్దరి మధ్యా స్నేహానికి ఆ పున్నాగ చెట్టు ఒక బలమైన బంధం.

తను అమ్మ, నాన్నలతో పల్లెకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి 'వసూ' వాళ్ళు లేరు. వాళ్ల నాన్న గారికి బదిలీ అయిందట. తను చాలా రోజులు బాధ మరువలేక పోయాడు. తిరిగి చాలా రోజులకు మిగిలిన స్నేహితులతో కలిసాడు. అయినా వసు మాత్రం అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చేది.

"నాన్నా"

రామకృష్ణయ్య గతంలోంచి వర్తమానంలోకి తేలాడు. కొడుకు మధుసూదనం డాక్టర్‌గార్ని వెంటబెట్టుకొని వచ్చాడు.

"ఎలా ఉంది నాన్నా"

రామకృష్ణయ్య మాట్లాడలేదు. డాక్టరు వచ్చి పరీక్ష చేశాడు. మధుసూదనం క్రిందికి వెళ్లాడు. తిరిగి కల్యాణితో సహా వచ్చాడు. కల్యాణి— మధుసూధనం భార్య— రామకృష్ణయ్య చెల్లెలు కూతురు.

"ఉదయం నుంచీ ఏమిచ్చారు ?" అడిగాడు డాక్టరు.

"ఏమీలేదు. మీరు పరీక్ష చేస్తానన్నారుగా— అందుకే మీ కోసం కబురు పంపాను— ఇప్పటి వరకూ ఆయన కాఫీ అయినా త్రాగలేదు." అంది కల్యాణి.

"అలాగా ! అయ్యో పాపం, నన్ను క్షమించండి" అన్నాడు డాక్టరు— రామకృష్ణయ్య వైపే తిరిగి.

"పోనీలే బాబూ !" రామకృష్ణయ్య నిట్టూర్పు రుస్తూ అన్నాడు.

"డాక్టర్, బొట్టు పెట్టుకున్నారు— ఏమిటి విశేషం ?"— మధుసూదనం.

"ఆఁ, ఏముంది— మా అమ్మ చాదస్తం. ఉదయం కోడలితో సహా గుడికెళ్లింది— ఆ ప్రసాదం ! చెవిలో పూవు కూడా ఉండాలి— ఎక్కడో జారిపోయినట్టుంది—" అన్నాడు డాక్టరు చెవి తడుముకుంటూ.

మధుసూదనం, కల్యాణి— నవ్వారు.

"మా నాన్నను పరీక్ష చేస్తారా ?"

"ఆ మందులు మార్పిస్తాను— మీరు పది గంటల కోసారి హాస్పిటల్‌కు రండి."

"అలాగే"

"ఓ. కే.— మీరేం దిగులు పడనవసరం లేదు బాబు గారూ! మీ ఆరోగ్యం ఈ వయసులో ఉండవలసిన వారికన్నా ఆరోగ్యంగానే ఉంది. మీకున్నది పెరాలిసిస్ ఒక్కటే. ఇదీ త్వరలో తగ్గే సూచనలు కన్పిస్తున్నది" అన్నాడు డాక్టరు— రామకృష్ణయ్యకు ధైర్యం చెబుతున్నట్లు.

ఆయనకు నవ్వు వచ్చింది.

"రోజూ ఇచ్చే ఆహారమే ఇవ్వండి"

"రాత్రి బాగా దగ్గారు డాక్టరుగారూ" అంది కల్యాణి.

"అయితే చెప్పరేం మరి ! మందు పంపుతాను లెండి" అని డాక్టరు వెళ్లిపోయాడు — మధుసూదనం ఆయన వెంట వెళ్లాడు.

కల్యాణి మామగార్ని నెమ్మదిగా లేపి— కూర్చో బెట్టి— స్టాండుతో సహా వాష్ బేసిన్‌ను ఆయన కనుకూలంగా అమర్చింది. వేడినీరు తెచ్చి ఇచ్చింది. ముఖ ప్రక్షాళన పూర్తయింది. ఆమె అవి తీసి— "కాఫీ ఫలహారం తెస్తాను మామయ్యా !" అని వెళ్లింది. ఇంతలో బిందు వచ్చింది. ఆమెను చూడగానే మళ్లీ వసు తలపుకు వచ్చిందాయనకు.

"బిందూ !"

"ఏం తాతయ్యా ?"

"నీ కెవరన్నా మొగ స్నేహితులున్నారే !"

"ఛో తాతయ్యా—" అని సిగ్గు పడింది.

"కాదమ్మా. . . . చెప్పవూ !"

"మొగవాళ్లతో స్నేహమేంటి ? !"

"ఏం ?"

"ఎబ్బే— వాళ్లు మంచి వాళ్లు కాదు. ఆడపిల్లల్ని ఆటఁ పట్టిస్తారు— గేలి చేస్తారు."

రామకృష్ణయ్య ఆశ్చర్యపోయాడు. అదే సమాధానం— ఆ నాటి వసు మాటలు జ్ఞాపక మొచ్చాయి.

"మంచి వాళ్లుండరా అమ్మా !"

"ఎవరో ఉంటారు. కాని, వాళ్లు ఒక్కొక్కప్పుడు ఏడిపిస్తారు."

"ఇంతకూ నీ కెవరూ లేరా బిందూ ?"

"డక్టరు గారి అబ్బాయి వేణు ఉన్నాడు తాతయా నీవూ చూసావుగా ! మేము ఇద్దరం డాక్టరు— నర్సూ ఆట ఆడుకుంటాం."

రామకృష్ణయ్యకు స్ఫురణకు వచ్చింది. వసూ— తనూ, మొగుడూ— పెళ్లాలాట ఆడుకునే వారు.

ఇంతలో కల్యాణి ప్లేటుతో వచ్చింది. బిందును చూసి— "ఏమిటే తాతయ్యను విసిగిస్తున్నావ్" అంది.

"యేమీ లేదులేమ్మా" అన్నాడు రామకృష్ణయ్య

కల్యాణి వచ్చి మామగారితో టిఫిన్ తినిపించ సాగింది.

"అయితే— ఈ డాక్టరుగారు క్రొత్తగా వచ్చాడమ్మా ?"

"అవును మామయ్యా, వచ్చిన కొద్దికాలం లోనే చాలా మంచిపేరు సంపాదించాడు. హస్తవాసి మంచిదని— అందుకే మీ అబ్బాయి వారిని తీసుకొస్తున్నారు. . . టిఫిన్ ఎలా ఉంది మామయ్యా ?"

"చాల రుచిగా ఉందమ్మా, వంటలో నీ హస్తవాసి గొప్పది."

కల్యాణి సిగ్గుపడి — చిరునవ్వు నవ్వింది. వెంటనే ఏదో విషయం జ్ఞాపకం వచ్చినట్లుంది. ఆమె ముఖం దిగులుగా మారింది. ఆమె ముఖం కేసి చూస్తున్న మామగారు— "ఏమిటమ్మా అలాగయ్యావు", అని అడిగాడు.

"ఏం లేదు మామయ్యా"

"చెప్పమ్మా— నా దగ్గర దాపరిక మెందుకు ?"

కల్యాణి ఒక్కక్షణం ఆగి, విషయం చెప్పింది.

"అమ్మ ఒంట్లో బాగా లేదట. ఉన్నట్టుండి వచ్చే బ్లడ్ ప్రెషర్, ఆయాసం, గుండెనొప్పి, ఉక్కిరి బిక్కిరి చేస్తున్నదట— ఈ రోజే ఉత్తరం వచ్చింది."

రామకృష్ణయ్య హృదయం బరువెక్కింది. చెల్లి సుభద్ర ఒంట్లో బాగో లేదా ! తన ఒక్కగా నొక్క చెల్లెలు. తనంటే వెర్రి అభిమానం. బావ గారు— ఆ అభిమానం తన మీద చూపటం లేదని —అన్యాయ పడే వాడు. అన్నచెల్లెళ్ళ మధ్య అను రాగ ముండటం క్రొత్త విషయం కాకపోయినా తమ మధ్యగల అనుబంధంలో మాత్రం ఏదో ప్రత్యేకత ఉన్నట్లు భావించే వారిద్దరూ. ఇద్దరి మధ్యా ఎలాంటి రహస్యాలు ఉండేవి కావు. తనకు మధు పుట్టిన నాటి నుండీ అనేది— "నేను మధు కోసం ఆడపిల్లనే కంటానన్నయ్యా ! నీవు నా బిడ్డనే కోడలిగా చేసుకో. నిన్ను నా లాగ చూసుకుంటుంది. నా మాట తీసివేస్తే చాల బాధపడతాను సుమా !" అని ఎప్పుడూ హెచ్చరించేది. అలాగే— మధు, కల్యాణుల మధ్య చిన్న నాటి నుంచీ ప్రేమ బీజం మొలకెత్తి— వారు పెద్దయ్యే నాటికి వృక్షమై, వూడలు తన్నుకుంది.

నిజంగా ఆమెకాక మరెవరైనా తన కోడలైతే తన ఈ స్థితిలో ఇంత ఆప్యాయంగా చూసేదా ? తల్లి కల్యాణికి వ్రాసే ప్రతి ఉత్తరంలోనూ తనను గురించే హెచ్చరించేది— "మామయ్య జాగ్రత్త— ఆయనంటే నాకున్న అభిమానం నీకు తెలియంది కాదు" అని. కల్యాణి బిందు విషయంలోనైనా ఒక్కొక్కప్పుడు అలక్ష్యంగా ఉంటుంది కాని, తన విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించదు. పైకే కాదు— మనో వాక్కాయ కర్మల మూడింట్లోనూ ఏ విధాన చూసినా ఆమెకు తన పట్ల నిర్లక్ష్యం కనిపించదు.

"ఏం మామయ్యా ఆలోచిస్తున్నావు?"

"ఏం లేదమ్మా, సుభద్ర ఆరోగ్యం అంతగా చెడిపోయిందా ! నీవీ మాట చెప్పగానే నాకు ఏ నాటి విషయాలో తలపుకు వస్తున్నాయి. మా ఇద్దరి మధ్య ఎంత ప్రేమ ! సుభద్రా, నేను కవల పిల్లలు. ఆప్తమిత్రులకన్నా సన్నిహితులుగా ఉండేవాళ్ళం. ఈ నాడు సుభద్ర అలాంటి స్థితిలో ఉండంటే వెళ్ళి చూడలేని అవస్థలో ఉన్నాను" అని నిట్టూర్చాడు. కల్యాణి సానుభూతిగా ఆయనకేసి చూసింది "పోనీ, నీవు వెళ్ళి చూసిరామ్మా"

"నేనా ! ఎలా మామయ్యా, మిమ్మల్నెవరు చూస్తారు. మిమ్మల్నిలా వదలి— తనను చూడ్డానికి వచ్చానని తెలిస్తే అమ్మ నా ముఖమైనా చూడదు."

"మరి— ఇది ఒక నాట తగ్గేదామ్మా. ఏం చేస్తాం, కర్మఫలం."

"బావనువెళ్ళి చూసి రమ్మందా మనుకుంటు న్నాను" అంది కల్యాణి.

"బావ చూస్తే మవ్వుచూపినట్లౌతుందా? అమ్మా పోనీ ఒక వారం రోజుల కోసం ఒక నర్సును నియ మించరాదూ— వాడు చెప్పినట్లు !"

కల్యాణి మాట్లాడలేదు. మరొక్కప్పుడయితే "నర్సయితే— ఈ ఆత్మీయత, ఆదరమూ ఉం టాయా మామయ్యా; అది డ్యూటీ లాగా ఉం టుంది. నాటికి ఏ ఒక్కరో నిజమైన సానుభూతితో సేవ చేస్తారు." అని ఖండించి వేసేది. లేదా "నేనుండగా ఈ ఇంట్లో నర్సును అడుగు పెట్ట నివ్వను" అనేది.

"అలాగే చెయ్యమ్మా, వారం రోజుల కోసం ఏం ఫర్వాలేదు."

అమ్మను చూడాలన్న ఆకాంక్ష కల్యాణికి ఎక్కువ గానే ఉంది. మరొకవైపు మామగార్ని విడిచి వెళ్ళాలంటే బాధగానూ ఉంది.

"కాఫీ తీసికోండి మామయ్యా— చల్లారి పోతుంది. ఆ ప్లేటులో చెయ్యి కడుక్కోండి. ట్రేలో పడితే ఫర్వాలేదు" ఆయన అలా చేసాడు. ట్రే తీసుకొని వెళ్ళిపోయింది.

గంటలో. క్రింద పనులు చూసుకొని తిరిగి వస్తుంది. పక్క మీద దుప్పట్లు—అవీ మారుస్తుంది. వెంకన్న సాయంతో బాత్‌రూంలోకి తీసుకెళ్ళి స్నానం చేయిస్తుంది. చిన్న పిల్లాడికి చేసినట్లు చేస్తుంది. రామకృష్ణయ్య మనసు వ్యాకులించి పోయింది. కల్యాణిని తలుచుకుంటే ఆయనకు తన తల్లి తలపుకు వచ్చింది.

చిన్నప్పుడు జ్వరం వచ్చి తను నీరసంగా ఉంటే తన తల్లి అలా చేసేది. మమత— మంచితనంలో ఆమెను వూరంతా దేవతగా చెప్పుకునే వారు. తనకు చిన్నప్పుడు తరచుగా జ్వరం వస్తుండేది. అమ్మ ఎప్పుడూ దగ్గర ఉండి తన శరీరం నిమురుతూ ఉండాలనిపించేది. ఆమె అలా చేస్తే వేరే మందు అనవసరం అనిపించేది. మెలుకువచ్చినప్పుడల్లా తన దగ్గరకు వచ్చి కూర్చునేది. కాని, ఇంటి పనులన్నీ ఆ అమ్మను వదలాలనిపించేది కాదు— తనకు.

ఇప్పుడు కల్యాణిని చూస్తే ఆమె తలపుకు వస్తుంది. కల్యాణి ఎప్పుడూ తన దగ్గరే కూర్చుంటే బావుండుననిపిస్తుంది. కల్యాణి అచ్చం తన తల్లి పోలికే. ఆ పేరే పెట్టినందుకు అమ్మమ్మ పోలికలూ, మంచి తనమూ పుణికి పుచ్చుకున్నట్లు ఉంది. ఆమె హుందాగా అంత పెద్ద ఇంటినీ దిద్దుకొంటూ మధ్యమధ్య తన దగ్గరికి వచ్చి సేవచేస్తూ ఉంటే తను చిన్న పిల్లవాడైనట్లూ, ఈ కల్యాణి తన తల్లి అనట్లూ— తెలియకుండానే గతంలోకి జారి పోతున్నాడు. కల్యాణిని తను 'అమ్మా' అని పిలిచి నప్పుడల్లా ఆమె తన వైపు చూసే చూపుల్లో ఎంత మాతృత్వం వెల్లివిరుస్తుంది ! 'ఏమిటి మామయ్యా?' అంటుంది కల్యాణి 'ఏమిటి బాబూ !' అనేది అమ్మ/ అదే తేడా

తన తల్లి చనిపోలేదు కల్యాణిలో జీవించే ఉంది. ఇది నిజం అని ఘోషించింది రామకృష్ణయ్య అంతర్యం. కల్యాణే తన తల్లి. ఆమె నీడలో ఉన్న తనకేమీ లోటు లేదు అనిపించేది. కళ్ళు మూసు కొని ఆలోచిస్తున్న వాడు కళ్ళు తెరిచాడు. గోడ మీద అమ్మా నాన్నలు పెళ్ళైన క్రొత్తలో దిగిన ఫోటో కనిపించింది. నాన్న— కండువా వేసుకుని చెప్పులు తొడుక్కొని, ప్రయాణానికి సిద్ధమైనట్లు —ఫోటోకు సిద్ధమయ్యాడు. కుర్చీలో కూర్చు న్నాడు. అమ్మ ప్రక్కన నిలబడి ఉండి, నాటి ఫ్యాషన్ అది. ఆ నాటి ఫోటో లోని అమ్మకు, ఈ నాటి కల్యాణికీ ఏమీ తేడా లేదు. ఆ ఫోటో ప్రక్కనే మధుసూదనం ఫోటో ఉంది.


అరె ! అదేమిటి ! !

మధు అచ్చంగా తన తండ్రిలాగే ఉన్నాడే ! తాతగారి పోలికలు రావటంలో ఆశ్చర్యము లేదు. కాని అంతగా మూస పోసినట్లు ఎలా ఉన్నది ? తన కొడుకు తన తండ్రి ఆత్మకు ప్రతినిధి కాడు గదా ? తన కోసమే తన తండ్రి మళ్ళీ జన్మ ఎత్తాడా ? ఏయన మీరిన తను— బరువైన బాధ్యతల్ని మోయలేడని కొడుకు రూపంలో వచ్చి తలకెత్తు కున్నాడా ? తనకు ఇలా విశ్రాంతి కల్పించాడా ?

"నాన్నా, ఏ విషయాన్ని గురించి నీ వేమీ ఆలో చించకు. అన్నీ నేను చూసుకుంటాను. నీవు పూర్తిగా విశ్రాంతి తీసుకో—" అనే కొడుకులో—

"బాబూ, నీకు జ్వరం వచ్చింది. బడికి వెళ్ళకు. మీ పంతులు గారికి నేను ఉత్తరం వ్రాస్తాను. నిద్ర పడుకో—" అంటూన్న తండ్రి కనిపించాడు.

అవును. తను పది సంవత్సరాల జ్వరం వచ్చిన అల్లరి పిల్లాడు. కల్యాణి తన తల్లి. మధుసూదనం తన తండ్రి. ఆ నాటి పసు ఈ నాటి బింగా రావు









# చిరంజీవులు

కృష్ణయ్యకు శరీరమూ, మనస్సూ తేలికయినట్లని పించింది. ఎంతో ఆనందంతో ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు.

"డాక్టర్‌గారి తల్లి మిమ్మల్ని చూడాలని వచ్చింది. మామయ్యా!"

కల్యాణి వెనకాల మరో ఎర్రని లావైన వృద్ధురాలు ఆయాస పడుతూ నిల్చుంది.

"రండమ్మా! కూర్చోండి" అన్నాడు రామకృష్ణయ్య— అరవై ఏళ్ళూ ఎదిగి పోయి ఆమె వచ్చి కుర్చీలో కూర్చుంది.

"నన్ను చూడటానికి శ్రమ పడి వచ్చారు. చాలా సంతోషం."

ఆమె నవ్వింది. "మా అబ్బాయి రోజూ మిమ్మల్ని గురించి చెబుతూ ఉంటాడు. మీరు చాలా మంచి వారట." అంది.

"నా మంచి తనం మీ వాడేం చూసాడో !"

"బహుశా చూడగానే అలా అనిపించి ఉంటుంది. నాకు వాడొక్కడే కొడుకు తర్వాత ఇద్దరాడపిల్లలు. వాళ్ళ కూతుళ్ళకు కూడా పెళ్ళిళ్ళయ్యాయి. వీడికే ఇద్దరాడపిల్లలు— ఒక కొడుకు" అన్న దామె.

"కూర్చోండి బామ్మగారూ, కాఫీ తెస్తాను" అంది కల్యాణి.

"వద్దులేమ్మా, ఇప్పుడు క్రింది దాకా ఎందుకు వెళ్తావు —అంతగా ఐతే వెళ్ళేటప్పుడు తాగుతానులే" అన్నదామె.

"ఎందుకు, క్షణంలో తెస్తాను" అని వెళ్ళింది కల్యాణి.

ఇద్దరి మధ్యా కొన్నిక్షణాలు మౌనంగా దొర్లాయి ఉన్నట్లుండి రామకృష్ణయ్య అన్నాడు "ఈ వార్ధక్యం చాలా అసహ్యకరమైంది. యేమంటారు ?

ఆమె నవ్వింది— "కాదంటాను దేనిలో ఉండే మాధుర్యం దానికుంది"

రామకృష్ణయ్యను ఆశ్చర్యం, ఆనందం అలుముకున్నాయి. ఒక్కసారిగా చలించి పోయి "వసూ" అన్నాడు.

ఆమె తెల్లబోయింది.

"నేను రామును,— పున్నాగు చెట్టు పువ్వులు, వీధిబడి. . . ." అన్నాడు వణకుతూ ఉన్న గొంతుతో

"రామూ ! నువ్వా, ఎన్నాళ్లకు కలుసుకున్నాము ఎంత ఆనందంగా— ఎంత విచిత్రంగా ఉంది. . ."

అతడు ఆమె చేతులు పట్టుకొని హృదయంపై ఉంచుకున్నాడు. ఆమె కళ్ళు మూసుకొని ఏదో పారవశ్యం అనుభవిస్తున్నది.

"చిన్నప్పుడు నాకు జ్వరం వస్తే ఇలాగే చూడటానికి వచ్చేదానివి. అప్పుడు జ్వరం తగ్గగానే తిరిగి ఎంతో ఉత్సాహంగా ఆడుకోగలననే ఆశ ఉండేది. కాని, ఇప్పుడు. . . ఆ ఆశాలేదు — అవకాశమూ లేదు." అని నిట్టూర్చాడు.

ఆమె మూసిన కన్నుల నుండి రెండు కన్నీటి బిందువులు జారాయి. అవి తుడుచుకుని "పోయేది ముందుకు— వెనక్కి వెళ్ళలేము రామూ !" అన్నది.

"వెళ్ళగలం వసూ. కాని అది మన ఆంతర్యంలో ఉంది. మన భావంలో ఉంది. ఇప్పుడు మంచంలో నుంచి లేవలేని స్థితిలో— ఇన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్ళి నీతో ఆడుకుంటున్నాను నీకు పువ్వులు రాల్చి పెడుతున్నాను. నాన్ననూ, అమ్మనూ— మధుసూదనం, కల్యాణిలలో చూస్తున్నాను. నిన్ను బిందూతో చూసుకుంటున్నాను. వసూ,— మనిషికి చావు లేదు. నా తండ్రి నా కొడుగ్గా కనిపిస్తున్నాడు. మధుకు రేపు నేను తన కొడుకులో కనిపిస్తాను. రంగు రంగుల కాలచక్రం ఆగకుండా తిరుగుతున్నట్లే కనిపిస్తుంది. కాని, వచ్చిపోయిన రంగులే మళ్ళీ వస్తుంటాయి అంతే."

"అవును రామూ ! కాని, నేను నీ అంత ఉన్నతికి ఇంకా రాలేదు. ఇప్పుడిప్పుడే అది అనుభవంలోకి వస్తున్నది." అంది— యాభై ఆరేళ్ళ వసు.

"అవును. ఇంకా మంచాన పడలేదుగా" అని నవ్వాడు రామకృష్ణయ్య.

వసు మాట్లాడలేదు.

"వూరుకో బిందూ! ఏమిటా అల్లరి ? తోచనీయకుండా. . ." అన్న కల్యాణి కంఠం వినిపించింది.

వసు గబుక్కున తన చేతులు ఇవతలకు లాక్కుంది.

తల్లితో పాటు బిందు కూడా గదిలోకి వచ్చింది.

"ఈ పిల్లేనా? బిందు రామకృష్ణయ్యగారూ ! అయితే, మీ మనవరాలు నా మనవడితో ఆడుకొనడానికి రోజూ వస్తుంది."

"అలాగా వసుమతీదేవిగారు, మంచి దోస్తీ కట్టింది" అన్నాడు రామకృష్ణయ్య.

"కాఫీ తీసుకోండి పిన్నిగారు"

వసుమతిదేవి అందుకుని, ఒక్కసారి చప్పరించి, "చాలా రుచిగా ఉందమ్మా" అని మిగిలింది త్రాగింది.

ఆ తర్వాత కొంతసేపు మాట్లాడి వసుమతిదేవి వెళ్లిపోయింది. వెళ్ళేటప్పుడు ఆమె నడక చూసి నవ్వుకున్నాడు రామకృష్ణయ్య. ఆమె వెనక్కి తిరిగి —'నీవీ మాత్రం కూడా నడవలేవుగా' అన్నట్లుగా చూస్తూ వెళ్ళిపోయింది.

'వసు' బామ్మ అయిపోయింది. అయితే డాక్టర్ వసు కొడుకే ననుకున్నాడు. వసు ఇంకా తిరుగుతూనే ఉంది— నాకన్నా నయమే.

ఆమెను పంపించి— కల్యాణి వెంకన్నతో సహా వచ్చింది— మామగార్ని స్నానం చేయించటానికి. ఒక పావుగంటలో ఆ కార్యక్రమం ముగిసింది. వెంకన్న దోవతి కట్టి, లాల్చి వేసుకోటంలో సాయం చేశాడు. వచ్చేసరికి పక్క దుప్పట్లు మార్చి ఉన్నాయి. వెంకన్న ఆయన్ను మంచంపై చేర్చి "ఏమన్నా కావాలా పెదబాబూ" అని అడిగాడు.

"ఏం కావాలిరా ? నాకేం కావాలి, ఏమీవద్దు" అన్నాడు రామకృష్ణయ్య.

వెంకన్న ఆయన వైపు చిత్రంగా చూసి వెళ్ళిపోయాడు. రామకృష్ణయ్య గోడమీది ఫొటో వంక చూస్తూ గతాన్ని నెమరువేసుకో సాగాడు. అవును.— ఇంక మిగిలిందేమిటి— గతాన్ని నెమరు వేసుకోటం తప్ప ! అనుభవాలా. . . అనుభవించేటప్పుడు తప్ప మరేం ఉపయోగముంది వాటివల్ల అనుకునేవాడు ఒకప్పుడు, కాని, వాటి ఉపయోగం ఇన్నాళ్ళకు తెల్సింది. ఆ అనుభవాల జ్ఞాపకలు ఇలా చేతకాని స్థితిలో సాయం చేస్తాయని ఇప్పుడు అర్థమయింది.

"నాన్నా"

రామకృష్ణయ్య కొడుకు వంక చూసాడు. మధు తండ్రివైపు చూస్తున్నాడు.

"ఏం మధూ !"

"నీవు దిగులు పడకు నాన్నా. మన డాక్టరుకు నీవు మళ్ళీ లేచి తిరగగలవన్న ఆశ ఉంది."

రామకృష్ణయ్యకు లోన సంతోషంగానే ఉంది. ఇది తగ్గినా, తగ్గక పోయినా, దీనితో కన్ను మూసినా — ఇప్పుడాయనకు సంతోషమే.

అయినా కొడుకు వంక చూసి, "తగ్గుతుందా?" అన్నాడు.

మధు దగ్గరగా వచ్చి "తప్పకుండా. . . నీవు ధైర్యంగా ఉండునాన్నా." అన్నాడు.

రామకృష్ణయ్యకు ఏడవాలనిపించింది. చిన్నప్పుడు 'ఈ జ్వరం ఇంకెన్నాళ్ళకు తగ్గుతుంది నాన్నా' అని తండ్రిని కౌగలించుకొని ఏడ్చినట్లు ఏడవాలనిపించింది. కాని అలా చేయలేక పోయాడు.

"ఏమో బాబూ !" అన్నాడు అయోమయంగా కళ్ళకు నీళ్ళు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ.

"నిరాశ పడకు నాన్నా"

తండ్రి మాట్లాడ లేదు.

"లక్ష్మి ఉత్తరం వ్రాసింది నాన్నా ! అన్నట్లు, నేను చెప్పటం మరిచి పోయాను— రవి వస్తున్నాడు" విషయం తిప్పించాడు మధు.

"ఎప్పుడు ?"

"ఈ రోజే"

"లక్ష్మి కాన్వెంటులో బాగా ఉందా? బాబూ! ఎప్పుడు వస్తుందిట ?"

"అదీ రావచ్చు ఇప్పుడు సెలవులే— కాని, స్నేహితురాళ్ళతోపాటు ఎటో 'ఎక్స్‌కర్షన్'కు వెళ్తున్నదట. రవి వచ్చేటప్పుడు వీలుగా ఉంటే ఆ ప్రోగ్రాం మానిపించి ఇంటికి తీసుకొస్తానని వ్రాసాడు.

రామకృష్ణయ్య హర్షం వెలిబుచ్చాడు.

రవి మధుకొడుకు. దూరాన మెడిసిన్ చదువుతున్నాడు. లక్ష్మి అతని తర్వాతది. వారి తర్వాతది బిందు.

హుందాగా నిల్చున్న మధును చూసి రామకృష్ణయ్య అనుకున్నాడు అచ్చం నాన్నలా ఉన్నాడు. ఆ నడకా, పోలికా, తీరు— అంతా అదే.

ఆయన నిర్విచారంగా కళ్ళుమూసుకున్నాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు బిందు పరిగెత్తుకొని వచ్చి, నిద్ర లేపి చెప్పింది — "అన్నయ్య వచ్చాడు— అక్కయ్య నాగార్జున సాగర్ వెళ్ళిందట" అని. మరి కాస్సేపట్లో రవితో సహా మిగిలిన వారూ వచ్చారు. రవి వచ్చి తాతగారి పాదాలకు నమస్కరించాడు. మనుమని స్పర్శలో రామకృష్ణయ్యకొక వైచిత్రం కనిపించింది. ఆ స్పర్శ— తన శరీరాన్ని తాను ముట్టుకుంటే కలిగిన అనుభూతిలాగే ఉంది. ఆయనకొక రహస్యం తెలిసినట్లనిపించింది. అస్పష్టంగా మనుమణ్ణి ఆశీర్వదించాడు. కుశల ప్రశ్నలయ్యాయి. డాక్టరు కాబోతున్న రవి తాతగారి ఆరోగ్యాన్ని గురించి చాలా ప్రశ్నలడిగాడు. అంతా వెళ్ళి— తాతా మనుమలు మిగిలారు. ఆ తర్వాత ఒక బంగారు రంగు అట్టవేసిన తెల్లకాగితాల పుస్తకం తీసి, తాతగారి కందిచ్చాడు.

"ఇదేంటి రవీ ?"

"ఇది డైరీ తాతయ్యా ! మన అనుభవాలన్నీ ఇందులో వ్రాసుకోవచ్చు. అందులో చాలా ఆనందముంది. ఇతరులకు చెప్పుకలేని వ్రాసుకున్నందువల్ల ఒక అంతరంగిక మిత్రునికి చెప్పుకున్న అనుభూతి, తృప్తి కలుగుతాయి."

"అవును బాబూ, నేను బయటికి స్పష్టం చెయ్యలేని కోరికను నీవు గ్రహించి తీర్చావు. అవును— నా అంతర్వాణి నీవు"

రవి తెల్లబోయాడు. ఏమీ అర్థం కాలేదు.

"ఏమిటి తాతయ్యా పిచ్చిగా మాట్లాడుతున్నావు ?"

"పిచ్చికాదు బాబూ, కంగారు పడకు. నీ కిప్పు డర్థం కాదు."

"ఎప్పు డర్థ మవుతుంది."

"నీవు నా ఈడు వాడివైనప్పుడు"

రవి కర్థం కాలేదు. అయినా నవ్వాడు.

'అవును— నేను పోయినా వీడిలో జీవిస్తాను. నా వయసులో మధు— నన్ను వీడిలో చూసుకుంటాడు' అనుకున్నాడు రామకృష్ణయ్య.

"తాతయ్యా, ఒక మాట !"

"ఏమిటి బాబూ"

"నీవా పుస్తకంలో వ్రాసింది నన్ను చూడనిస్తావా ?" చిన్న పిల్లాడిలా, ఆప్తమిత్రుడిలా అడిగాడు రవి.

---

అధికారి : ఏమయ్యా ! ఈ రోజు యింత ఆలస్యంగా ఆఫీసుకి దయచేశావ్ ?

గుమాస్తా : నిద్ర మెలకువ రా లేదండీ !

అధికారి : ఇంట్లో కూడా నువ్వు ఇక్కడిలా నిద్రపోతా వేంటి !

ఎం. పురుషోత్తం నాయుడు (మద్రాసు)

---

"నీవు వేరు— నేను వేరానా బాబు ! నువ్వే నేను— నేనే నువ్వు."

"తాతయ్యా !"

"విచిత్రంగా ఉందా రవీ !"

"లేదు తాతయ్యా, ఏమిటో అర్థమయ్యీ కానట్లుగా ఉంది."

"బాబూ"

"ఊఁ"

"నీ వెవరినన్నా ప్రేమించ నన్నా ప్రేమించావా ?" సిగ్గు పడ్డాడు మనుమడు.

"చెప్పు బాబూ, మనిద్దరం ఒకటే ! ఆప్తమిత్రులం. మన మధ్య రహస్యాలెందుకు. మన తనువులు వేరుగాని, అంతర్య మొకటే బాబూ ! ఈ విషయం నీ కర్థం కావటానికి, అనుభవంలోకి రావటానికి చాలా కాలం పడుతుంది"

"ఏమిటో తాతయ్యా ! నీ ముందేమీ దాచాలని పించటం లేదు. అవును— నే నొక అమ్మాయిని ప్రేమించాను." తల వంచుకొని సిగ్గుపడుతూ చెప్పాడు.

"అయితే బాబూ, నా దొక కోరిక,—"

"ఏమిటి ?"

"నాకా అమ్మాయిని ఒకసారి చూపిస్తావా"

"ఎలా ? ఆమె ఇక్కడ లేదే ! నా మెడిసిన్ అయ్యాక చిన్నగా నాన్నకు ఆమె విషయం చెప్పాలి"

"చాలా కాల మవుతుందేమో !"

"అవును"

"ఎలా మరి ?"

ఒక్క క్షణం ఆలోచించాడు రవి. "పోనీ, ఫోటో ఉంది— చూస్తావా" అన్నాడు.

"ఆ, తీసుకరా"

రవి క్రిందికి వెళ్ళాడు.

రామకృష్ణయ్య భార్య ఫోటో వైపు చూస్తూ "పిరికా ! రవి తీసుకొచ్చేది నిన్నేనా" అనుకున్నాడు.

రవి ఫోటో తెచ్చాడు. చూపించాడు. రామకృష్ణయ్య అతికష్టం మీద మూడ గలిగాడు. "బాబూ, ఈ ఫోటోను నీ నాయనమ్మ ఫోటో ప్రక్కన ఉంచి నన్నక్కడికి తీసుకపో"

రవి అతి కష్టం మీద అలా చేశాడు. మనుమని సాయంతో రామకృష్ణయ్య వెళ్ళి రెండు ఫోటోలూ చూసి తృప్తిపడి, హర్షం వెలిబుచ్చాడు. అయినా తన కళ్ళను తను నమ్మలేక రవి నడిగాడు.

"బాబూ, ఈ రెండు ఫోటోల్లో ఏకేమన్నా పోలికలు కనిపిస్తున్నాయా"

"ఏమిటి తాతయ్యా, నీ చాదస్తం—బామ్మకూ, ఆ పిల్లకూ పోలిక లెలా కలుస్తాయి" అన్నాడు రవి.

"తొందర పడకు బాబూ, నిదానించి చూడు"

రవి పరీక్షగా చూసాడు. నిజమే ! ఆ కళ్ళు, ముక్కూ, మొహం తీరూ బాగానే కలిసాయి. "నిజమే తాతయ్యా, ఇదెలా సంభవించింది ! !" అన్నాడు ఆశ్చర్యంగా.

రామకృష్ణయ్య సంతృప్తిగా మనుమని వంక చూసి నవ్వాడు.

"చెప్పు తాతయ్యా, ఇదెలా జరిగింది."

"ఎలా చెప్పను బాబూ ! నేను ఇన్నాళ్ళు మంచంలో తపస్సు చేసి కనుక్కున్న సత్యాన్ని నీ కొక్క మాటలో ఎలా చెప్పగలను. అది అనుభవంలో గాని అర్థం కాదు. కొంత వరకైనా అర్థం చేసుకోవాలంటే నీవు నాకు బహుమానంగా ఇచ్చిన పుస్తకంలో నేను వ్రాయ బోయేది చూడు."

రవి తాతగారి వంక ఒక మహా బుద్ధుని చూసినట్లు చూడసాగాడు.

"బాబూ, ఆ అమ్మాయిని నా కొకసారి చూపించవూ !"

"అలాగే తాతయ్యా— తప్పక చూపిస్తాను"

మనుమని సాయంతో తిరిగి ప్రక్క మీదికి చేరాడు రామకృష్ణయ్య. రవి "మళ్ళీవస్తా తాతయ్యా" అని వెళ్ళి పోయాడు.

అతను వెళ్ళాక రామకృష్ణయ్య— క్రొత్త పుస్తకంలో— వణుకుతూ ఉన్న చేతితో ఇలా వ్రాసాడు :

"మంచంలో పడిందాకా నాలో మార్పు ఏమీ లేదు. ఆ తర్వాత నన్ను నిరాశా నిస్పృహలు పెన వేసుకున్నాయ్.

కౌగిలించుకున్న వార్ధక్యం నా శరీరంలో చర్మాన్నీ, యముకల్నీ మాత్రం మిగిల్చి జవసత్వాల్ని సహా ఐలలించుపుల్లా పీల్చివేసింది. ఆరు నెలలు పీడిస్తున్న పక్షవాతం వల్ల కాలూ, చెయ్యి చచ్చుబడి

డాక్టర్ వృత్తి చేయండి



విరామకాలంలో ఇంటిలో పోస్టల్ ట్యూషన్‌ద్వారా హోమియోపతి చదివి, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి.

ప్రాస్పెక్టస్ ఉచితం. వెంటనే వ్రాయండి:

**Indian Homoeopathic College,**

(APW), JULLUNDUR CITY



పండిత
డి. గోపాలాచార్యులవారి

# జీవామృతం

ఆరోగ్యానికి బలానికి

ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17



చార్మిస్ మీ ముఖవర్చస్సును మనోహరముగా చేస్తుంది!



ఉత్సాహవంతులుకండి...

లాలిత్యం పొందండి...

రోజంతా

శోభచేకూర్చుకోండి!

కల్లని, సేదదేర్చె చార్మిస్ మీకు రోజంతా శోభచేకూర్చుటలో సహాయపడుతుంది. చార్మిస్‌యొక్క ఆనందప్రదమైన వాసన మిమ్మల్ని సేదదేర్చుటలో యింద్రజాలములా పనిచేస్తుంది—మిమ్మల్ని ఉత్సాహవంతులను చేస్తుంది...మిమ్మల్ని అందముగా మనోహరముగా కనపడేలా చేయుటలో సహకరిస్తుంది.

# చార్మిస్

టాల్కమ్ పౌడర్ ఆనందప్రదమైన వాసన కలిగి వున్నది

CHTP.G.11.TEL


# చిరంజీవులు

—పుల్లల్లాగా అయిపోయాయి. వార్ధక్య జీవితం ఎంతో దుర్భరమైందనుకున్నాను! నా శరీరం చూసుకుంటే నాకే అసహ్యం వేసేది. ఒకప్పుడీ శరీరం ఎంతో అందంగా ఉండేది. శరీరం చాలక పిగిలి పోతుందా అన్నట్లు వేడిరక్తాన్ని నింపుకున్న నరాలు బలమైన రాళ్ళలాంటి కండరాల్ని పెన వేసుకొని ఉండేవి. తీయని కోరికంతో తేలిపోయే ఆనాటి మధుర స్మృతులు ఈ నాడు చెదిరిన స్వప్నాల్లా మిగిలాయి. శరీరంలోని యవ్వనం పోయింది. ముఖంలోని లావణ్యం, కళ్ళలోని కాంతులు— అన్నీ హరించుకు పోయాయి. నెత్తిమీది జుత్తు రాలిపోగా మిగిలింది— వెండి పూత పూసుకుంది.

ఓ భగవంతుడా! ఇంకా ఎన్నాళ్ళీ అవస్థ— త్వరగా చేదుకో తండ్రీ. . . అని భగవంతుణ్ణి ప్రార్థించాను.

ఒక నాడు నిలువుటద్దం ఎదురుగా నిలబడి—సగర్వంగా చూసుకొని వన్నె నేనే ప్రేమించుకొన్న ఈ శరీరాన్ని—

ఈ నాడు— ఎంత త్వరగా, ఒక్క తన్ను తన్ని శ్రీ కైవల్య పథం చేరుదామా అనిపిస్తుంది.

కామం అంటే జుగుప్స, మానవులంటే అసహ్యం కలుగుతున్నాయ్. మానసంలోని నవరసాలూ మంచులా కరిగి, లావాలా ఉడికి, ఆవిరై శూన్యంలో కలిసి పోయాయి.

అర్థం లేని ఆలోచనలు— స్థిరంలేని మనస్సు.

మేడమీద గదిలో పందిరి మంచం మీద— సుఖానికి లక్కువ లేదు. ఆదరణకు కరువు లేదు.

అయినా— భరించలేకపోయాను.

కాని,—

ఇదంతా నిన్నటి దాకానే. ఈ రోజు నేను పరిపక్వ దశకు వచ్చాను. ఇప్పుడు నన్ను చూస్తే నా కసహ్యం లేదు. దిగులులేదు. చచ్చిపోతానన్న భయం లేదు. ఈ వార్ధక్యం తీయని వేము. ప్రతి వారూ అనుభవించాలి. తీయని ఈ వేమును రుచి చూడాలి అప్పుడే పరిపక్వ దశకు రాగలుగుతారు.

మానవుడు చిరంజీవి. మానవునికి చావులేదు. నేనిప్పుడు నా కొడుకులో నా తండ్రిని చూస్తున్నాను. కోడలిలో తల్లిని చూస్తున్నాను. వాళ్ళలో నాకు— చిన్నప్పుడు నాకు జ్వరం వచ్చినప్పుడు ఆవేదన పడే అమ్మ, నాన్న కనిపిస్తున్నారు. చిన్ననాడు జ్వరంతో మంచంలో పడ్డప్పుడు చూడవచ్చిన పసును ఈ నాడు బిందులో చూస్తూ అల్లరి చేస్తున్నాను. నా కొడుకు నా వయసుకు వచ్చాక నన్ను తన కొడుకులో ఇలాగే చూసుకుంటాడు. ఆ విధంగా నేను చిరంజీవిని. రవిలో నేను జీవించి ఉంటాను. రవి భార్యలో పార్వతి జీవించి ఉంటుంది. ఈ విధంగా మానవులు చిరంజీవులు. దేనికీ దిగులు పడనవసరం లేదు. మృత్యువుకు భయపడ నవసరం లేదు. ఈ సత్యాన్ని కనుక్కొని నేను పరిపక్వ దశకు వచ్చాననుకుంటున్నాను. పరిపక్వ మంటే ఇదే అయితే నా జన్మ సార్థక మయినట్లే, నాకిప్పుడే కోరికలూ లేవు— ఆశలూ లేవు." ★